ఊరంతా.. సంక్రాంతి

- నేడు భోగి మంటలకు సిద్ధం
- పట్టణాలు ఖాళీ.. పల్లెలు కళకళ
- అంబరాన్ని అంటేలా సంక్రాంతి సంబరాలు
- రాజధానిలో నేడు భోగి వేడుకలకు చంద్రబాబు, పవన్

గుంటూరు సిటీ, జనవరి 13: సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే శుభ వేళ జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి. లోగిళ్ల కొత్త పంటలతో కళకళలాడుతుండగా.. పిండి వంటల సువాసనలు.. హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల సందడి.. గొబ్బెమ్మలతో రంగుల ముగ్గుల అలంకారం.. ఇదంతా సంక్రాంతి వైభవం. చిన్నా.. పెద్ద.. కలిసి చేసుకునే సంబరం. మనసులను.. మనుషులను కలిపే పండుగ వైభోగం. పల్లె ముంగిట్లో మాత్రమే కనిపించే సందడి. ఇలా ఈ పండుగ గురించి ఎన్ని చెప్పినా.. చెప్పుకున్నా తక్కువే.

ఈ ఏడాది సంక్రాంతి మరింత ముస్తాబుగా కనిపిస్తుంది. తెలుగువారి పెద్ద పండుగ కోటి ఆశల పందిరిగా అనిపిస్తుంది. కోడి పందాలు.. మందు.. విందులతో భోగీ రోజున అంబరాన్ని అంటే సంబరాలకు పల్లెల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున భోగి మంటలకు చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా శనివారం రాత్రి నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంటి దగ్గర పండుగ సందడికి పట్టణాలు, నగర ప్రాంతాల నుంచి కుటుంబాలకు కుటుంబాలు పల్లెకు తరలి వచ్చాయి. దీంతో పలు పట్టణ ప్రాంతాలు వెలవెలపోతుండగా.. పండుగకు వచ్చిన వారితో పల్లెలు కళకళలాడుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలతో పాటు ఇతర దేశాల్లో స్థిరపడిన వారందరూ పల్లెకు తరలిచ్చారు. వివిధ నగరాలు, ఇతర దేశాల నుంచి ఎన్నారైలు పెద్ద సంఖ్యలో పల్లె గడప తొక్కడంతో పల్లెల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిస్తున్నాయి. ఇక వారి బంధువులు, తల్లిదండ్రుల్లో అయితే సంతోషం చెప్పనలివి కాకుండా ఉంది. హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో పలువురు ఒకేసారి వాహనాలతో బయలుదేరడంతో అద్దంకి-నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారి వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయింది. తుమ్మల చెరువు, మంగళగిరి సమీపంలోని టోల్ గేట్ల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.

రాజధాని రైతు కళ్ళలో కొత్త ఆనందం

ఈ ఏడాది సంక్రాంతి వేళ రాజధాని రైతుల కళ్లలో కొత్త ఆనందం కనిపిస్తోంది. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ నిరంకుశ విధానాలతో గాయపడిన రైతుల గుండెల్లో తాజా రాజకీయ పరిణామాలతో కొత్త సంతోషం కనిపిస్తోంది. భోగి మంటల్లో గత చేదు జ్ఞాపకాలను, ప్రభుత్వ అరాచక జీవోలను తగల బెట్టేందుకు రాజధాని ప్రాంతవాసులు సిద్ధమయ్యారు. ప్రభుత్వం మారుతుందన్న సర్వేలు, విశ్లేషణలతో గత కొంత కాలంగా రియల్ ఎస్టేట్ రంగానికి ఈ ప్రాంతంలో ఊపు వచ్చింది. ఇది కూడా రాజధానిలో సంక్రాంతి సందడిని ఎక్కువ చేస్తోంది. ఇక భోగి పండుగను మరింత సంబరంగా జరుపుకునేలా రైతులు, గ్రామీణులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తుళ్లూరు మండలం మందడం గ్రామం గోల్డెన్ రూల్ ఆవరణలో జరిగే భోగీ వేడుకలకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. ఈ పరిణామం రైతు కళ్లలో కొత్త కాంతు లకు కారణమైంది. వేడుకల ఏర్పాట్లను తాడికొండ టీడీపీ ఇన్‌చార్జ్ తెనాలి శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు.







హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల మీదగా పల్లెలకు వెళుతున్న కార్లు

తీరంలో.. కోఢీ



- బరులకు భారీగా ఏర్పాట్లు
- నేటి నుంచి జోరుగా పందాలు
- కోత ముక్కలాటకు ప్రత్యేక టెంట్లు
- రూ.10 వేల నుంచి 2 లక్షల పందాలకు బరులు
- సమీప జిల్లాలు, తెలంగాణ నుంచి తరలిరానున్న జనం

రేపల్లె, భట్టిప్రోలు, చుండూరు, జనవరి 13: సంక్రాంతి వచ్చేసింది.. సంబరాలు అంబరాన్ని అంటేలా వేడుకలు చేసుకునేందుకు పల్లె జనం సిద్ధమయ్యారు. భోగితో సంక్రాంతి సంబరాలు ప్రారంభమవనుండగా.. కోడి పందాలకు కోళ్లు సై అంటూ కాలు దువ్వేందుకు సిద్ధమయ్యాయి. పందాల సందడికి జూదరులు సిద్ధమవగా.. వాటిని చూడాలని ఉత్సుకతతో పలువురు తరలిరానున్నారు. అధికారులు అడ్డుకుంటున్నా తీర ప్రాంతంలో తగ్గేదేలేదన్నట్లుగా కోడిపందాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంక్రాంతి సంప్రదాయలను అడ్డంపెట్టుకుని కోడిపందాలకు బరులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. తీర ప్రాంతంలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలో అధికార పార్టీ పెద్దల ఆధ్వర్యంలో భారీ బరులను ఏర్పాటు చేశారు.



లక్ష నుండి రూ.5 లక్షలు కోడిపందాలు వేసేందుకు సిద్ధం చేస్తున్న బరి

కోడిపందాలతో పాటు పేకాట, లోనబయట, కోతముక్క, గుండాటలకు బరుల వద్ద నిర్వాహకులు ఒక్కొక్కరు నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కోడిపందాల జూదరులతో పాటు వాటిని చూసేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు గుంటూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి వేలాదిగా తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాలకు విరుద్ధంగా రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకులు బరులను ఏర్పాటు చేస్తున్నారు. రేపల్లె, నిజాంపట్నం, భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో 216 జాతీయ రహదారి పక్కన బరులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా బరుల వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశాల్ని రూ.లక్షలకు మండల స్థాయి నాయకులకు అప్పగించారు. బరుల వద్ద మద్యం అమ్ముకునేందుకు పాటలు నిర్వహించారు. బిర్యానీ పాయింట్‌కు రూ.5 లక్షలకుపైగానే, శీతల పానీయాలు, గుట్కాలు, ఖైనీలు సిగరెట్లు అమ్మేవారి నుంచి రూ.2 లక్షలు వసూలు చేశారు. కేటగిరీల వారీగా రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షల బరులను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి కోడిపందాలు నిర్వహిస్తామని నిర్వాహకులు ఇప్పటికే ప్రకటించారు. కోడిపందాలు వేసేందుకు గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, తెలంగాణ నుంచి వచ్చిన వారితో రేపల్లెలోని లాడ్జీలు నిండిపోయాయి.

పోలీసుల ఆదేశాలు బేఖాతారు

రెండు రోజులుగా తీరప్రాంతంలో కోడిపందాలను కట్టడి చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతో నిర్వాహకులు పోలీసుల సమక్షంలోనే బరులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా బరుల వద్ద పోలీసులు కాపలా కాసినా ఫలితంలేకుండా పోయింది. రాజకీయా నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు శనివారం వెనుతిరిగి వెళ్లిపోయారని సమాచారం. నిజాంపట్నంలో పది బరులను ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో కోడి పందాలకు భూమిని చదును చేశారు. మూడు రోజుల పాటు పందాలు నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించారు. బరుల ఏర్పాటుకు తీసుకువచ్చిన సామగ్రిని పోలీసులు పంపించి బందోబస్తు ఉన్నారు. చుండూరులో నాలుగు రోజుల క్రితం అధికార పార్టీ పెద్దలతో నియోజకవర్గ నాయకుడు జరిపిన సంప్రదింపులు సఫలం అయ్యాయి. దీంతో స్థానిక నాయకులు చుండూరు, వేటపాలెం మధ్య పొలాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది రూ.కోటికిపైగా ఆదాయం రావడంతో ఈ ఏడాది కూడా నిర్వాహకులు కోడిపందాలకు పోటీపడుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది కూడా అదే స్థలంలో పందాల కోసం రెండు ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోల్స్ వేసి బరులకు సిద్ధం చేశారు. ఆయా ఏర్పాట్లు వెనుక వైసీపీ పెద్దలు ఉండటంతో స్థానిక పోలీసులు వారిని అడ్డుకోలేకపోతున్నారని సమాచారం.

కొల్లూరు : కోడి పందాల బరి ఏర్పాట్లను అడ్డుకున్న తహసీల్దార్, ఎస్ఐలు



ఏర్పాట్లను అడ్డుకున్న అధికారులు

కొల్లూరు: మండలంలోని పెసర్లంక పొలాల్లో బరి కోసం జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఎస్ఐ రాజ్యలక్ష్మీ, తహసీల్దార్ శ్రీనివాసరావులు అడ్డుకున్నారు. సంప్రదాయబద్ధంగా కోడి పందాలు వేసుకుంటామని, పైగా తమ పొలంలో బరి ఏర్పాటు చేసుకుంటే ఏమైందని నిర్వాహకులు అధికారులను ప్రశ్నించారు. కోడి పందాలకు ఎటువంటి అనుమతులు లేవని నిర్వాహకులకు ఎస్ఐ, తహసీల్దార్ తేల్చిచెప్పారు.



నిజాంపట్నంలో కోడిపందాలు నిర్వహించేందుకు బరులను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

జగన్‌కు.. ఝలక్

- మొన్న రాయుడు.. నేడు బాలశౌరి
- ఇప్పటికే దూరమైన శ్రీకృష్ణదేవరాయులు ?
- ఎంపీలకు సీఎం రేవంత్ విందు తెచ్చిన తంటా
- కక్షతోనే సీట్లు మార్పిడి వంకతో లావు, బాలశౌరిలకు పొగ



గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ తన సంకుచిత మనస్తత్వంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు చేజేతులా పార్టీ వీడే పరిస్థితి తెచ్చుకున్నారు. మరొక ఔత్సాహిక ఎంపీ కూడా ఇప్పటికే పార్టీని వీడారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన మచిలీపట్నం ఆఫర్ అందుకున్న రాయుడే కాకుండా, తనను ఉట్టి పుణ్యానికే పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నారని భావించిన సిట్టింగ్ ఎంపీ బాలశౌరి కూడా వైసీపీకి రాజీనామా చేసి జగన్‌కు ఝలక్ ఇచ్చారు. ఇక ఇప్పటికే జగన్ నిర్ణయంపై మండిపడుతూ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వైసీపీకి అనధికారికంగా దూరమయ్యారు. దీనికంతటికీ జగన్‌కు తెలియకుండా తెలంగాణ సీఎం పీఠాన్ని దక్కించుకున్న ఎంపీ రేవంత్‌రెడ్డి ఆ పదవిని వీడి వస్తూ ఢిల్లీలో ఇటీవల అన్ని పార్టీల ఎంపీలకు విందు కారణమని సమాచారం. రేవంత్ విందుకు వైసీపీ ఎంపీలు 20 మంది వరకు వెళ్లారు. వైసీపీ ఎంపీలను ఆ విందుకు తీసుకెళ్లడంలో కృష్ణదేవరాయులు కీలక పాత్ర పోషించారు. తోటి ఎంపీ సీఎంగా ఇస్తున్న వీడ్కోలు విందుకు వెళ్లడం తప్పేమిటని మిగతా వైసీపీ ఎంపీలను ఒప్పించి తీసుకెళ్ళారు. కృష్ణదేవరాయులతో సన్నిహితంగా ఉండే ఎంపీ వల్లభనేని బాలశౌరి కూడా ఈ విందు వ్యవహారంలో కో కెప్టెన్‌గా వ్యవహరించారు. రేవంత్‌రెడ్డి విందుకు వైసీపీ ఎంపీలు వెళ్లడంలో కృష్ణదేవరాయులు, బాలశౌరిలు కీలకపాత్ర వహించారనే కక్షతోనే సీట్లు మార్పిడి వంకతో వారు కోరుకున్న స్థానాల నుంచి పోటీ చేసే అవకాశం కల్పించకుండా జగన్ పొగపెట్టి దూరం చేసుకున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకి చెందిన బాలశౌరికి గత ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. స్థానికేతరుడైనప్పటికీ ఆ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేసి తిరిగి మచిలీపట్నం నుంచే పోటీ చేయాలనే కోరికతో బాలశౌరి ఉన్నారు. ఈ క్రమంలో గుంటూరుపై ఆశతో ఉన్న క్రికెటర్ అంబటి రాయుడికి మచిలీపట్నం నుంచి పోటీ చేస్తేనే సీటు ఇస్తానని జగన్ ఆఫర్ ఇచ్చారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న తనను కాదని రాయుడిని పోటీ చేయమనటంతో బాలశౌరీకి మండింది. అదేమిటని జగన్‌ను ప్రశ్నించగా 'సర్వేలో అక్కడ నుంచి తిరిగి నీకు గెలిచే అవకాశాలు లేవు... ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం అదే పార్లమెంటు పరిధిలో కల్పిస్తాను..' అంటూ బాలశౌరికి జగన్ సర్ది చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈ ఆఫర్ వింతగా ఉండటంతో తనను పొమ్మనకుండా పొగబెడుతున్నారని భావించిన బాలశౌరి వైసీపీకి రాజీనామా చేయటం ద్వారా గుంటూరు మిర్చి ఘాటు చూపించారు. జనసేన, టీడీపీ కూటమి ద్వారా ఆయన అదే నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

గుంటూరుకు బదిలీపై లావు గుడ్‌బై?

గుంటూరుకు చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులు గత ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో తొలుత లావుకు గుంటూరు ఎంపీ సీటునే ఇస్తానని జగన్ చెప్పడంతో 2019 ఎన్నికల సమయంలో ఏడాదికి ముందే విజయం కోసం వ్యూహరచన చేసుకున్నారు. అయితే ఎన్నికలు సమీపించే సమయానికి ఈ సీటును మోదుగుల వేణుగోపాల్‌రెడ్డికి ఇచ్చేం దుకు కృష్ణదేవరాయులను ఉన్న పళంగా నరసరావు పేటకు పం పారు. ఇక్కడ పడిన శ్రమంతా వృథా అవుతుందని గుంటూరు సీటు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవ డంతో అయిష్టంగానే నరసరావుపేట నుంచి పోటీ చేసేం దుకు కృష్ణదే వరాయులు అంగీకరించారు. సుమారు లక్షన్నర ఓట్ల ఆధిక్యతతో లావు విజయం సాధించారు. అయితే వచ్చే ఎన్నికల్లో నరసరావుపేటపై ఆసక్తితో ఉండగా తిరిగి గుంటూరులో పోటీ చేయని జగన్ లావును ఆదేశించారు. దీంతో జగన్ జిగ్‌జాగ్ ఆడుతున్నాడని కృష్ణదేవరాయులు అధికారికంగా రాజీనామా చేసి జగన్‌కు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. మానసికంగా కృష్ణదేవరాయులు వైసీపీని వీడినప్పటికీ మంచి ముహూర్తం చూసుకుని రాజీనామా చేసి టీడీపీలో చేరడం ఖాయమని సమాచారం.

సొసైటీల్లో.. కమిటీల పాలనే

- మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
- దొడ్డిదారిన కమిటీలతో పాలన కొనసాగింపు
- ఇక వైసీపీ హయాంలో సహకార ఎన్నికలు లేనట్లే
- ఐదేళ్లగా ఎన్నికలకు సాహసం చేయని ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పని చేయాలి. అయితే వారి భాగస్వామ్యం లేకుండా.. సంఘాల్లో వారి పాత్రను దూరం చేసేలే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలలు త్రిసభ్య కమిటీల ఆధ్వర్యం లోనే సహకార సంఘాల కార్యకలాపాలు జరగనున్నాయి. ఎన్నికలు నిర్వహించ కుండా దొడ్డిదారిన కమిటీలతో ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఐదేళ్లుగా సహకార ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సాహసం చేయడంలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలలో త్రిసభ్య కమిటీల పాలనను కొత్తగా ప్రవేశ పెట్టింది. దీనిని కొనసాగించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపింది. మరో ఆరు నెలలు ఆయా కమిటీల పాలనను కొనసాగిస్తూ శుక్రవారం ఉత్తర్వులను విడుదల చేసింది. పార్టీ నేతలకు పదవులు ఇచ్చుకునేందుకే ఎన్నికలను నిర్వహించ డంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అయినా వాటిని లెక్క చేయకుండా ప్రత్యేక కమిటీలనే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు ఉన్నా యి. త్రిసభ్య కమిటీల పదవి కాలం ముగిసింది. దీంతో 18 నుంచి జూలై 17 వరకు ఆ కమిటీల పదవీ కాలం పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాలకు అతీతంగా సహకార సంఘాలు పని చేయాల్సి ఉండగా మితిమీరిన రాజకీయ జోక్యం ఉం టున్నది. దీంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతు లు వాపోతున్నారు. ఎన్నికలు నిర్వహిస్తేనే సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

2013లో సహకార ఎన్నికలు

సహకార సంఘాలకు చివరగా 2013లో జరిగాయి. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సొసైటీల అధ్యక్షుల పదవీ కాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు ఉంటాయని అందరూ ఎదురుచూశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాలను కూడా అధికారులు సిద్ధం చేశారు. తొలుత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇలా రెండు సార్లు ప్రకటనలు చేసినా ఎన్నికలను నిర్వహించేందుకు వైసీపీ ప్రభుత్వం సాహసం చేయలేదు. పైగా త్రి సభ్య కమిటీల పాలనను సొసైటీల్లో ప్రవేశపెట్టింది.

ఇష్టారాజ్యంగా త్రిసభ్య కమిటీలు

జిల్లాలోని కొన్ని సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ఎన్నికలు లేక పోవడంతో తాత్కాలిక కమిటీలు అక్రమాలకు తెరతీశాయని ఆరోపణలు న్నాయి. కొన్ని చోట్ల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్న విమర్శలున్నాయి. రాజకీయ కారణాల తో ఎప్పటి నుంచో పని చేస్తున్న ఉద్యోగులను తొల గించి వారి స్థానంలో కొత్త వారిని ఆయా కమిటీలు నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. మార్చి 2019 కన్నా ముందుగా సొసైటీల లో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేసేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు 2020 డిసెంబరులో ప్రభుత్వం మరో సారి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను కొన్ని త్రి సభ్య కమిటీలు నియమించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా నియామకాలకు లక్షల్లో డబ్బు చేతులు మారినట్లు ప్రచారం ఉంది. ఆయా నియామకాలపై విచారణ జరిగితే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.



మంత్రి అంబటి డాన్స్ కోసం రోడ్లు దిగ్బంధం



గోళ్లమూడివారి వీధిలో రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

సత్తెనపల్లి జనవరి 13: సత్తెనపల్లి గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగే సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మంత్రి అంబటి రాంబాబు నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీంతో శనివారం నుంచే ఆ ప్రాంతానికి వెళ్లే భవిరిశెట్టివారి వీధి, గోళ్లమూడివారిలో బారికేడ్లు ఏర్పాటు చేసి రోడ్లను దిగ్బంధం చేశారు. దీంతో ఈ ప్రాంతాల్లోని వ్యాపార సంస్థల నిర్వాహకులతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి డాన్స్ కోసం పండుగ రోజుల్లో రోడ్లు దిగ్బంధం చేసి వ్యాపారులను, ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

వైసీపీ నుంచి టీడీపీలోకి 150 కుటుంబాలు

● రానున్న కాలంలో పెద్దసంఖ్యలో చేరికలు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ

వినుకొండ, జనవరి 13: స్థానిక నరసరావుపేట రోడ్డులోని జీవీ గెస్ట్‌హౌస్‌లో నూజెండ్ల మండలం ముప్పరాజువారిపాలేనికి చెందిన సర్పంచ్ నిమనూరు మాధవి శ్రీను ఆధ్వర్యంలో 150 కుటుంబాలు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలో జీవీ ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ముప్పరాజు రామలింగయ్య (వైస్‌సర్పంచ్), రామారావు, రవి, గోరంట్ల అంజయ్య, ఐనీడి వెంకట్రావు, ముళ్లమూరు శ్రీను, వెంకటేశ్వర్లు, దేవరపల్లి పెదకాశయ్య, షేక్ మాబుసుభాని, ఆటో కాలేషా, దాసరి లింగయ్య, కందుల ఏలయ్య, బోసుబోతుల చిన్నలింగయ్య, ముప్పరాజు వెంకటరామయ్య ఉన్నారు. అనంతరం జీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. సైకో పాలనకు చరమగీతం పాడేందుకు వైసీపీ నాయకులు జనసేన, టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. పార్టీలో చేరినవారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గెలుపు కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని, కార్యకర్తలకు సముచితస్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీసాల మురళీకృష్ణయాదవ్, డీఎల్‌డీఏ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు, బచ్చు అంజిరెడ్డి, వంకాయలపాటి పేరయ్య, గంగినేని ఆంజయ్య, బొట్ల అంజయ్య, సోమేపల్లి బ్రహ్మయ్య, ముంద్రు సుబ్బారావు, గుర్నాథం, బుల్లేశ్వరరెడ్డి, బత్తుల సుబ్బారావు, మేదరమెట్ల అనిల్, మరిడి సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర సంపద అమరావతిపై అభాండాలు

● ప్రభుత్వ తీరు మారకుంటే ప్రజాగ్రహం తప్పదు ● 1488వ రోజుకు రైతుల ఆందోళనలు


బిల్డ్ అమరావతి అంటూ మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

తుళ్లూరు, జనవరి 13: రాష్ట్ర సంపదైన అమరావతిపై వైసీపీ పాలకులు అనేక అభాండాలు వేశారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1488వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ, మూడు రాజధానులని వైసీపీ ప్రభుత్వం ఆడుతున్న డ్రామాలు ఆపకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేదన్నారు. మూడు ముక్కల ఆట వైసీపీ పాలకుల సొంత ప్రయోజనాల కోసం పెట్టిన అంశమన్నారు. ప్రజా రాజధాని అమరావతేనని పేర్కొన్నారు. అమరావతిని వ్యతిరేకిస్తే ఐదు కోట్ల మంది తెలుగువారిని వ్యతిరేకించినట్లేనన్నారు. వైసీపీ పాలకులు రాష్ట్ర రాజధానిని నాశనం చేసే దుర్మార్గపు ఆలోచనతో ఉన్నారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు అంటే గౌరవం లేకుండా వైసీపీ పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. మూడు ముక్కల ఆట రాష్ట్రాభివృద్ధికి ఆటంకమన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతే.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి దోహదమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

సంక్రాంతి కానుకల పంపిణీకి పోలీసుల అడ్డంకి

● ఇంటింటికీ తిరిగి అందజేసిన టీడీపీ నేత మోహనకృష్ణ
● గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పదివేల మందికి కానుకలు
● చంద్రబాబు స్ఫూర్తితో పేదల కళ్లలో ఆనందం కోసమేనన్న మన్నవ


సంక్రాంతి కానుకలు అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పోలీసులు శాంతిభద్రతలు కాపాడాలి. కాని వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ఇతర పక్షాలకు సంబంధించిన కార్యక్రమాలను అడ్డుకోవడమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారు. వివిధ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ సంక్రాంతి సందర్భంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే అందుకు పోలీసులు అనుమతించలేదు. అయినా ఆయన వెనక్కి తగ్గకుండా ఇంటింటికీ తిరిగి స్వయంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో పేదల కళ్లలో ఆనందం కోసం పశ్చిమ నియోజకవర్గంలో పది వేల మందికి కానుకలను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. పండగ పూట ప్రతి లోగిలి సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఆనాడు టీడీపీ ప్రభుత్వం చంద్రన్న కానుక పేరుతో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలు అందించిందన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి రావడంతోనే ఆయా పండుగ కానుకులను రద్దు చేసి పేదల పొట్టగొట్టిందన్నారు. గతంలో అనేక పండుగలకు చంద్రన్న కానుకలను అందచేశామన్నారు. పోలీసులు అనేక ఆంక్షలు విధిస్తూ ఈ కార్యక్రమ నిర్వహణకు అనుమతి నిరాకరించారని తెలిపారు. దసరా పండుగ సందర్భంగా దసరా చంద్రన్న కానుక పంపిణీకి కూడా పోలీసులు అనుమతి నిరాకరించారని గుర్తుచేశారు. ఈసారి పేదలకు ఎలాగైన సంక్రాంతి కానుక అందించాలనే లక్ష్యంతో తానే ఇంటింటికి వెళ్లి నిత్యావసర సరుకులతో కూడిన చంద్రన్న సంక్రాంతి కానుకలు అందజేశామన్నారు. చంద్రబాబు పేరు మీద ఈ కార్యక్రమం చేపట్టడం సంతృప్తినిచ్చిందని తెలిపారు.


రుద్రవరంలో టీడీపీలో చేరినవారితో కన్నా లక్ష్మీనారాయణ

జగన్ అసమర్థ పాలనతో విసిగిపోయిన ప్రజలు

● చంద్రబాబు అఖండ మెజారిటీతో సీఎం అవుతారు: కన్నా
● టీడీపీలో చేరిన మాదల, రుద్రవరంలోని పలువురు వైసీపీ కార్యకర్తలు

ముప్పాళ్ళ, జనవరి 13: జగన్ అవినీతి, అసమర్థ పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగి పోయి తెలుగుదేశం వైపు చూస్తున్నారని సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు మండలంలోని మాదల, రుద్రవరం గ్రామాలలో వైసీపీ కార్యకర్తలు పలువురు కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాను కప్పి ఆహ్వానించాడు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ రాష్ట్రం జగన్ చేతకాని పాలనలో 20 సంవత్సరాల వెనక్కువెళ్ళిందన్నారు. రాష్ట్రం మరలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడుకు మాత్రమే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. అందుకే రాష్ట్రంలో పెద్దఎత్తున వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ముందుగా రుద్రవరంలో మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు రావిపాటి నానయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పనులు కల్పించకుండా ఇసుక దోపిడీ

● సీఎం జగన్‌కు యావజ్జీవం తప్పదు
● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ధ్వజం


కోనూరులో డాక్టర్ కొమ్మాలపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

అచ్చంపేట, జనవరి 13: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి యాజవజ్జీవ జైలు శిక్ష తప్పదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ధ్వజమెత్తారు. శనివారం కోనూరులోని ఎస్సీ కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు శ్రీధర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలు, ఎస్టీలకు, కూలీలకు ఇసుక పనులు కల్పించకుండా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జగన్‌రెడ్డి పెత్తందారి పోకడలను వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతున్నారన్నారు. ఈ పరిస్థితి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఐడీని అడ్డం పెట్టుకొని చంద్రబాబుపై కేసులు నమోదు చేయించి జగన్ తన సొంత మీడియాలో దుష్ప్రచారాలకు దిగుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న కేసుల్లో 12 సంవత్సరాలుగా 3,500 వాయిదాలు తీసుకున్నారన్నారు. జగన్ ఒత్తిడితో సీబీఐ నమోదు చేసిన కేసుల్లో చంద్రబాబును ఇరికించినా కోర్టుకు ఆధారాలు చూపలేకపోయారన్నారు. 2004లో కొద్ది ఆస్తులు ఉన్న జగన్‌రెడ్డి నేడు నాలుగు లక్షల కోట్లకు ఎలా ఎదిగారని ప్రశ్నించారు. జగన్ చేసిన నిలువు దోపిడీపై ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఐడీతో చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి 53 రోజులు జైల్లో నిర్బంధించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలను పలు సందర్భాల్లో కోర్టులు తప్పుబట్టాయన్నారు.

ఎన్నికల తరువాత వైసీపీ గల్లంతు

● జగన్‌కు జైలు ఖాయం ● మాజీ మంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట అర్బన్, జనవరి 13: ఎన్నికల తరువాత వైసీపీ అడ్రస్ గల్లంతు కావటం, జైలుకు పోవటం ఖాయమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతపై ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ నానా అడ్డదారులు తొక్కుతున్నారని ధ్వజమెత్తారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని వేలకోట్లు వెనకేసుకున్న జగన్ అసలు రాజకీయాలకు, ప్రజాసేవకు అనర్హుడన్నారు. ఆదివారం నుంచి తెలుగుదేశం పార్టీ ప్రారంభించనున్న రా కదలి రా... కార్యక్రమ సన్నాహాలపై టీడీపీ ముఖ్య నేతలతో శనివారం తన నివాసంలో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై వైసీపీ సర్కారు కక్ష సాధింపు చర్యలు, అక్రమకేసులపై నిప్పులు చెరిగారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు జగన్ నిరంకుశ పాలనను జనం తరిమి కొట్టే రోజు త్వరలోనే ఉందన్నారు. రూ.43వేల కోట్ల దోపిడీపై సీబీఐ, ఈడీ 38 కేసులు పెడితే కనీసం కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న దొంగ జగన్ అని ఎద్దేవా చేశారు. సీబీఐ కేసుల్లో వాయిదాలే ఊపిరిగా జగన్ రాజకీయ జీవితం ఉందన్నారు. ఈ కేసులకు తోడు ఈ ఐదు సంవత్సరాల్లో జగన్ చేసిన అవినీతిపై టీడీపీ అధికారంలోకి రాగానే జగన్ కొత్త కేసులు ఎదుర్కోక తప్పదన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు జగన్ హయాంలో జరిగిన అవినీతిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

ఐదు రోజులకు 7వేల యూనిట్లు

● విద్యుత్ హైసెక్యూరిటీ మీటర్లతో గుండె దడ ● బెంబేలెత్తుతున్న రైస్ మిల్లర్లు
● పూర్తి బిల్లు చెల్లించాలని హుకుం జారీ చేస్తున్న అధికారులు


వేమూరులోని ఓ రైస్ మిల్లులకు రీడింగ్‌తో సంబంధం లేకుండా అధిక మొత్తంలో జారీ అయిన విద్యుత్ బిల్లు


రైస్ మిల్లులకు కొత్తగా ఏర్పాటు చేసిన హై సెక్యూరిటీ మీటర్లు

వేమూరు, జనవరి 13: ఇటీవల రైస్ మిల్లుల్లో రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌కో శాఖ ద్వారా ఏర్పాటుచేసిన హైసెక్యూరిటీ మీటర్ల ద్వారా ఊహించని రీతిలో బిల్లులు రావడంతో మిల్లుల యజమానులు బెంబేలెత్తుతున్నారు. డిసెంబర్ 27న హైసెక్యూరిటీ మీటర్లు బిగించారు. ఒకటి రెండు తేదీలలో రీడింగు నమోదు చేశారు. కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే ఒక్కొక్క మిల్లుకు 15వేల నుండి 50వేలపై దాకా అధిక మొత్తంలో బిల్లులు రావడంతో మిల్లర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఐదు రోజులకే పెద్ద మొత్తంలో బిల్లులు రావడం వల్ల నెల రోజుల వ్యవధికి ఇంకెంత వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వేమూరులోని లక్ష్మీగణపతి రైస్ మిల్లులో కేడబ్ల్యూహెచ్ రీడింగ్ పరిశీలిస్తే 3685 యూనిట్లు మంజూరైన బిల్లులో చూపింది. అయితే అదే బిల్లులో కేవీ ఏహెచ్ బిల్లింగ్ అంటూ పై రీడింగ్ బిల్ పక్కన 10167 యూనిట్లు రీడింగ్ చూపడంతో పాటు అదనంగా 6,482 యూనిట్లకు రూ.67,442 అదనపు బిల్లు చెల్లించాలంటూ రీడింగ్ నోటీసులు జారీ చేశారు. అలాగే విజయలక్ష్మీ రైస్ మిల్లులో కూడా 1082 యూనిట్లు తేడా రావడం వల్ల రూ.13వేలు అదనపు బిల్లు చూపింది. మరో వింతేమిటంటే మిల్లు ఆన్ చేయకుండానే రీడింగ్ చూపటం విశేషం. గతంలో సాధారణ మీటర్లు ఉండేవని, అప్పుడు లేని సమస్య హై సెక్యూరిటీ మీటర్లు ఏర్పాటుచేసిన తర్వాత ఏర్పడిందని మిల్లర్లు వాపోతున్నారు. మిల్లుల స్థాయిని బట్టి కెపాసిటర్లను కూడా పెంచి ఏర్పాటుచేశామని, వాటిని తొలగించి ఆటోమేటిక్ కెపాసిటర్లు పెట్టాలని ప్రభుత్వం అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. ఆటోమేటిక్ కెపాసిటర్లు కనుక ఏర్పాటు చేస్తే వాటి ద్వారా కూడా రీడింగ్ మరింతగా పెరిగే అవకాశం ఉందని, ఆ విధానాన్ని అమలు పరచొద్దని కోరుతున్నారు. జారీ అయిన బిల్లులు చెల్లించక తప్పదని ట్రాన్స్‌కో అధికారులు హుకుం జారీ చేస్తున్నట్లు యజమానులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కొత్తగా ఏర్పాటుచేసిన హైసెక్యూరిటీ మీటర్లను తొలగించి వాటి స్థానంలో సాధారణ మీటర్లను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ గోపిని వివరణ కోరగా హైసెక్యూరిటీ మీటర్ల విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఉన్నతాధికారుల అనుమతితో వాటిని పరిశీలించి సహకరిస్తామన్నారు.

ఫిబ్రవరి 23, 24న చలపతి ఉద్గోష్2కే24


చలపతి ఉద్గోష్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు

మోతడక(తాడికొండ), జనవరి 13: మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 23, 24 తేదీల్లో చలపతి ఉద్గోష్-24 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో చలపతి ఉద్గోష్ 2కే24 బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23, 24 తేదీలలో యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయి టెక్నో, కల్చరల్, క్రీడా పోటీలు ఉద్గోష్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే కిరణ్‌కుమార్, డైరెక్టర్ డీ.వినయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే నాగ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వీ.సాయి శ్రీనివాస్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ కే జయంత్, వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

● 80 లక్షల విలువైన బంగారం, వెండి, కార్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం
● పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


స్వాధీనం చేసుకున్న బంగారు నగలును పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

దాచేపల్లి, జనవరి 13: వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి రూ.80 లక్షల విలువైన బంగారం, వెండి, ద్విచక్ర వాహనాలు, కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి శనివారం తెలిపారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టుబడిన దొంగల నుండి 80 లక్షల విలువైన సొమ్ము, రూ.20 లక్షల విలువైన కార్లు నాలుగు, రూ.8.5 లక్షల విలువైన 15 ద్విచక్ర వాహనాలు, రూ.50 లక్షల విలువైన 850 గ్రాముల బంగారు నగలు, లక్షన్నర విలువ కలిగిన రెండున్నర కేజీల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం గోలి గ్రామానికి చెందిన పొన్నూరు చినసత్యానందం, పిడుగురాళ్లకు చెందిన రుద్రాల సురేష్, పెదగార్లపాడుకు చెందిన షేక్ ఇమాంషా, మరో 10మంది వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తుల నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల, అద్దంకి, చేబ్రోలు, మాచర్ల, దుర్గి, ఏలేశ్వరం, పిఠాపురం, ఈపూరు, సత్తెనపల్లి, కారంపూడి, మిర్యాలగూడ ప్రాంతాలలో వీరిపై 25 కేసులు నమోదైనట్లు వివరించారు. ప్రధానంగా తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని బంగారం, వెండి, కార్లు, బైక్‌లను దొంగతనం చేసినట్లు తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు వివరించారు. దొంగలను పట్టుకునేందుకు ఎస్ఐలు నాగరాజు, సంధ్యారాణిలు, షేక్ సమీర్‌బాషా, హెచ్‌సీ రాఘవయ్య, పీసీలు వెంకట్రావు నాయక్, జబ్బార్‌లాల్ నాయక్, కోటేశ్వరరావు, పవన్, గోవిందు నాయక్, అరుణకుమార్, సాంబశివరావు శ్రమించి నిందితులను అరెస్టు చేశారన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అభినందనలు తెలిపి రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ పళ్లంరాజు, సీఐ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, నిఖిల్ తదితరులు

పల్లె పిలుస్తోంది....రా కదలిరా....!

పిడుగురాళ్ల, జనవరి 13 : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగకు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో రా....కదలిరా కార్యక్రమం వాల్ పోస్టర్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిడుగురాళ్లలో ఆవిష్కరించారు. యువత, ఐటీడీపీ సభ్యులు యువతను మరింత ఆకర్షించే విధంగా ఐటీడీపీ, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు పనిచేయాలని యరపతినేని శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో యరపతినేని సాయినిఖిల్, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, దియ్యా రామకృష్ణ, గండికోట వెంకటేశ్వర్లు, రావిపూడి నవీన్, గుదె విష్ణు, బొల్లా వికాస్, తదితరులు పాల్గొన్నారు.

4వ వార్డులో 'మన ఊరు-మన ఆట'

పిడుగురాళ్ల, జనవరి 13 : స్థానిక 4వ వార్డు ప్రజాశక్తి నగర్‌లో 'మన ఊరు - మన ఆట' కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ దూదేకుల ఖాశిం, ప్రచార కమిటీ సభ్యులు దూదేకుల సలీం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, స్కిప్పింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కృష్ణా, గుంటూరు జిల్లాల మహిళా కో-ఆర్డినేటర్ పార్వతినాయుడు, నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి రమేష్, కిరణ్‌కుమార్, చల్లగుండ్ల సీత, లక్ష్మీ, నామాల పుష్పలత, రమణ, కొత్త అరుణ, సయ్యద్ అమీర్‌అలి, ఆర్‌డబ్ల్యుఎస్ కిరీటి, షేక్ వలి, యడవల్లి కొండలు, బంకా సామేలు, దూదేకుల ఖాశిం, శారద, బుడే పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చింతలపూడి శ్రీనివాసరావు తదితరులు

పిడుగురాళ్ల, జనవరి 13: చింతలపూడి చారిటబుల్ ట్రస్టు, పల్నాడు హాస్పటల్ ఆధ్వర్యంలో నాల్గవ రోజు పిడుగురాళ్లలో సంక్రాంతి రంగవల్లుల పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మొదటిసారిగా సంక్రాంతి విశిష్టత, సోషల్ మీడియా, రైతు, వ్యవసాయం, భారతదేశ సమగ్రత వంటి విభిన్న రీతిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పిడుగురాళ్లలోని పల్నాడు ఒయాసిస్‌లో శనివారం జరిగిన ముగ్గుల పోటీలలో భారతదేశ సమగ్రతపై మొదటి విజేతగా బి.శిరీష, రెండవ విజేతగా కె.అఖిల, మూడవ విజేతగా పి.నిర్మలారెడ్డిలకు ట్రస్టు చైర్మన్ చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ అశోక్‌కుమార్, రమ్యహారిక, కమిటీ సభ్యులు ఫ్రిజ్, కలర్ టీవి, వెట్ గ్రైండర్‌లను అందజేశారు. అదేవిధంగా ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేశారు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

సత్తెనపల్లి, జనవరి 13 : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ అంగన్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 32వ రోజుకు చేరుకుంది. సమ్మెకు మద్దతు ఇచ్చిన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందుకు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ నాయకులు సుజాత, అహల్యా మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

● పిడుగురాళ్ల, జనవరి 13: నెలరోజులకు పైగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం కూడా పిడుగురాళ్లలో తమ నిరసన కొనసాగించారు. ఆర్‌అండ్‌బి బంగ్లా ఎదుట సమ్మె శిబిరంలో ముగ్గులు వేసి తమ సమస్యలను తీర్చాలంటూ ముగ్గులతో అర్థమయ్యేలా అంగన్‌వాడీలు ముగ్గులతో నిరసన తెలియజేశారు.

● క్రోసూరు, జనవరి 13 : డిమాండ్ల సాధన కోసం 33 రోజులుగా మొక్కవోని దీక్షతో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల పోరాటం దేశ కార్మిక వ్యవస్థకు స్ఫూర్తిదాయకమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ.ప్రేమ్ కుమార్ అన్నారు. క్రోసూరు అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వై.గోపాలరావు కూడా దీక్షా శిబిరాన్ని సందర్శించారు. వారిరువురు మాట్లాడుతూ అంగన్‌వాడీల మీద ఎస్మా చట్టం ప్రయోగించటం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు, జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కుంభా శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, గోవిందరెడ్డి, అంగన్ వాడీల యూనియన్ నాయకులు జయలక్ష్మి, శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి, జనవరి 13: అంగనవాడీ కార్యకర్తలు గత 33 రోజుల నుండి సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఉద్యమం చారిత్రకమైనదన్నారు. అంగనవాడీలకు యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, యూటీఎఫ్ మండల నాయకులు జి.సుబ్బారావు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో అడుగడుగునా ట్రాఫిక్ ఆటంకం

పిడుగురాళ్ల, జనవరి 13: పండుగ వేళ సొంతింటికి వచ్చే వారి వాహనాలతో అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారి శుక్రవారం అర్ధరాత్రి నుండే రద్దీ పెరిగింది. శనివారం కూడా తుమ్మలచెరువు టోల్ ప్లాజా వద్ద, పిడుగురాళ్లలో వాహనాల రద్దీతో రహదారులు కిటకిటలాడాయి. పిడుగురాళ్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఓ వాహనం మరమ్మతులకు గురికావడంతో అడుగడుగున ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడింది. ఎక్కువగా కార్లతోనే రహదారి రద్దీ పెరిగిపోవడంతో పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్‌లో రోడ్డు దాటేందుకు వీలుకానంత వాహనరద్దీ ఏర్పడింది.

కాపు జేఏసీ యూత్ మండల అధ్యక్షుడిగా శెట్టిపల్లి

దుర్గి, జనవరి 13 : కాపు జేఏసీ యూత్ మండల అధ్యక్షుడిగా శెట్టిపల్లి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మ శ్రీనివాసనాయుడు చేతుల మీదుగా శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు పసుపులేటి బ్రహ్మం, గోల్ల అంజనేయులు తదితరులు వెంకటేశ్వర్లును అభినందించారు.

దౌర్జనాలు, దోపిడీలకు కేరాఫ్‌గా మాచర్ల

● పోరాడకుంటే భవిష్యత్తు లేదు

● పిన్నెల్లి సోదరుల ఆగడాలు హద్దు మీరాయి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల, జనవరి 13: దౌర్జన్యాలు, దోపిడీలు, దుర్మార్గాలకు కేరాఫ్‌గా మాచర్ల నియోజకవర్గం మారిందని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పౌరుషాల గడ్డ పల్నాడులో అహింస అనే జెండా ఎగురవేసి దోపిడి, దుర్మార్గాలను అరికట్టాలన్నారు. 40 యేళ్ల రాజకీయ పార్టీగా ఇది మనందరి బాధ్యత అన్నారు. ప్రజల హక్కులు, విలువలు, ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నామన్నారు. ఎన్నో పార్టీలు వచ్చాయి పోయాయి.. ఇటువంటి దుర్మార పరిపాలన, అరాచక శక్తులను ఎప్పుడైనా చూశారా అన్నారు. ఏ రంగాన్ని వదిలిపెట్టకుండా అందర్నీ దోపిడి చేయడం, భూముల కబ్జాలు, బెదిరింపు వసూలు, ప్రధానంగా అన్యాయం జరిగిందంటే ఎవరికీ చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే బాధితుల పైనే కేసులు పెట్టేలా పోలీసు వ్యవస్థ ఉందన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు అంటూ నియోజకవర్గంలో తోట చంద్రయ్య, జల్లయ్యల హత్యలు, ఆత్మకూరులో ఎస్సీలు ఊరొదిలిపోయాలా చేశారని మండిపడ్డారు. స్వయాన జగన్‌మోహన్‌రెడ్డి 80 సీట్లు మారుస్తున్నారంటే ఓడిపోతారని వారికి వారు ఒప్పుకున్నారన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమన్నారు. పోరాడకుంటే భవిష్యత్తు లేదన్నారు. గెలుస్తామనే అత్యుత్సాహం కాకుండా గెలిచేదాక పోరాడాలన్నారు. నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరుల ఆగడాలు హద్దు మీరాయన్నారు. ఓ వైపు పిన్నెల్లి అనుచరుల దాడులతో భయపడుతుంటే మరోవైపు పోలీసు, రెవెన్యూ అధికారులు మరింతగా భయపెడుతున్నారన్నారు. పోలీసులు వైసీపీ కండువాలు కప్పుకొని తమ పార్టీ నేతలను స్టేషన్లో వేస్తున్నారని ఆవేదన చెందారు. పిన్నెల్లి సోదరులు అడ్డగోలుగా ఆస్తులు ఆక్రమిస్తున్నారని విమర్శించారు. నడిరోడ్డుపై వైసీపీ నేత హత్య చేసిన ఫొటోలు ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే మాకు సంబంధం లేదంటూ అబద్ధాలు చెబుతారన్నారు. టీడీపీని గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకొని రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బ్రహ్మారెడ్డి అన్నారు. ఆయన వెంట తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, నేరేటి వీరాస్వామి యాదవ్, పిన్నెల్లి మధుసూదనరెడ్డి తదితరులు ఉన్నారు.

బాజీచౌదరిపై కేసు కొట్టివేత

సత్తెనపల్లి, జనవరి 13: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరిపై డిసెంబరు 31న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును హైకోర్టు శుక్రవారం కొట్టివేసిందని హైకోర్టు న్యాయవాదులు వీవీ లక్ష్మీనారాయణ, నమ్రతాచౌదరి శనివారం తెలిపారు. బాజీ చౌదరి అచ్చంపేట మండలం ఓర్వకల్లుకు చెందిన డానీ, నవీన్, జాషువాలను డిసెంబరు 31న కుంకలగుంటలో కులంపేరుతో దూషించి అవమానించాడని వారి ఫిర్యాదుమేరకు సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బాజీచౌదరి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు న్యాయవాదులు లక్ష్మీనారాయణ, నమ్రతాచౌదరిలు బాజీచౌదరి తరుపున క్వాష్ పిటీషన్ దాఖలు చేశారు. హైకోర్టులో ఇరువర్గాలను విచారించిన అనంతరం హైకోర్టు కేసు కొట్టివేసిందని న్యాయవాదులు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ వెంకట నారాయణరెడ్డి

రెంటచింతల, జనవరి 13 : రెంటచింతల మండల నూతన ఎస్‌ఐగా కైపు వెంకట నారాయణరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. నారాయణరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తానని అన్నారు.

విజయపురిసౌత్ ఎస్‌ఐగా కొండారెడ్డి

విజయపురిసౌత్, జనవరి 13 : స్థానిక ఎస్‌ఐగా డివి కొండారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాపట్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన అనిల్‌కుమార్‌రెడ్డి స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లారు.

దుర్గి ఎస్‌ఐగా కోటయ్య

దుర్గి, జనవరి 13: దుర్గి ఎస్‌ఐగా ఎస్.కోటయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ రంగు పులిమి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

లాంచీ స్టేషన్ ఆదాయం రూ.70 వేలు

విజయపురిసౌత్, జనవరి 13 : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను శనివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. వీరు లాంచీ స్టేషన్ నుంచి లాంచీలో కొండకు చేరుకున్నారు. మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, మట్టికుండలు, మహాస్థూపం సందర్శించారు. అనంతరం అనుపు, ఎత్తిపోతలను వీక్షించారు. పర్యాటకుల రాకతో లాంచీ స్టేషన్‌కు రూ.70 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

రూ.25 లక్షలు మైనింగ్ నిధులు విడుదల

రెంటచింతల, జనవరి 13 : మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే నిమిత్తం ఎమ్మెల్యే పీఆర్కే ప్రత్యేక చొరవతో రూ.25 లక్షలు మైనింగ్ నిధులు విడుదలైనట్లు పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి చెప్పారు. గోలి గ్రామంలో కళ్యాణమండప నిర్మాణానికి రూ.15 లక్షలు,మంచికల్లులో ఆంజనేయస్వామి దేవాలయం ప్రహరీ నిర్మాణం నిమిత్తం రూ.10 లక్షలు విడుదలయ్యాయన్నారు. అయితే గోలి గ్రామానికి చెందిన రూ.15 లక్షలతో కళ్యాణమండపం నిర్మాణం జరిగే అవకాశం లేనందున మరో రూ.15 లక్షలు కావాలంటూ ప్రతిపాదనలు తయారు చేసి ఎమ్మెల్యేకిచ్చినట్లు పేర్కొన్నారు.

కోడిపందాలపై నిషేధం : ఎస్‌ఐ

మాచవరం, జనవరి 13 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మాచవరం మండల పరిధిలో ఎక్కడైనా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసు వారికి సమాచారం అందజేయాలని ఎస్‌ఐ సమీర్‌బాషా శనివారం తెలిపారు. ఎక్కడా కూడా కోడిపందాలు, జూదం ఆడటానికి వీలులేదని, అలాంటి కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కాపు జేఏసీ కార్యాలయం ప్రారంభం

మాచర్ల, జనవరి 13 : పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాపు జేఏసీ కార్యాలయాన్ని శనివారం కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాసనాయుడు ప్రారంభించారు. అనంతరం నూతన సభ్యులకు నియామక ఉత్తర్వులు అందించారు. నియోజకవర్గ అధ్యక్షుడు పసుపులేటి బ్రహ్మానాయుడు, భీమా కృష్ణమూర్తి, వట్టెం నరసింహారావు, జక్కా నరసింహారావు, రవి, అంజి, రాంబాబు, మల్లయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, రామారావు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి గొర్రెల కాపరి మృతి

అమరావతి, జనవరి 13 : మండల పరిధిలోని లేమల్లె గ్రామ సరిహద్దులో గల క్వారీ నీటి గుంతలో పడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాలలోకి వెళితే... మాచర్ల మండలం కొత్తూరుకు చెందిన జె.వీరాంజనేయులు (35) తన గొర్రెలను లేమల్లె గ్రామ పరిసరాల్లో మేతకు తీసుకెళ్లారు. సమీపంలో ఉన్న క్వారీ గుంతలో నీరు తాగడానికి గొర్రెలు వెళ్లడంతో వాటిని తిరిగి బయటకు తరలించే సమయంలో ప్రమాద వశాత్తు నీటిగుంతలో పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న సీఐ బ్రహ్మం సంఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం మృతదేహం లభ్యమైంది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

క్రోసూరు, జనవరి 13 : ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో శనివారం క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఎమ్మెల్యే శంకరరావు, ఆయన సతీమణి వసంత కుమారి కార్యకర్తలతో కలసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. పిల్లలకు భోగి పండ్లు పోశారు. కోడి పుంజులను పట్టుకొని బరిలోకి దిగారు. రకరకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్టు ఎమ్మెల్యే దంపతులు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

క్రోసూరు, జనవరి 13 : క్రోసూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోను, వేణుగోపాల స్వామి దేవాలయంలోను శనివారం ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. వేణుగోపాలస్వామి దేవాలయంలో జరిగిన పోటీల విజేతలకు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య రూ.లక్ష నగదు బహుమతులను అందజేశారు. క్రోసూరు ఎస్‌ఐ నరసింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురికి కొమ్మాలపాటి నివాళి

పెదకూరపాడు, జనవరి 13 : పెదకూరపాడు టీడీపీ సీనియర్ నాయకుడు నాదెండ్ల కోటేశ్వరరావు దశ దిన కర్మను పురస్కరించుకొని చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఘనంగా నివాళులర్పించారు. గ్రామానికి చెందిన కంచర్ల విజయబాబు, జలాలపురంలో వడ్లమూడి రామాయమ్మ చిత్రపటాల వద్ద కొమ్మాలపాటి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, జలాలపురం మాజీ సర్పంచ్ ఏ.లక్ష్మీనారాయణ, టీడీపీ మండల నాయకులు మద్దినేని వెంకట సత్యనారాయణ, గర్నేని సాంబశివరావు, బాలయ్య, వెంకటరత్నం, పాటి బాలయ్య ఉన్నారు.

● అచ్చంపేట, జనవరి 13 : మండలంలోని చిగురుపాడు గ్రామంలో ఆరుద్ర చెంచమ్మ(70) శనివారం అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తాళ్ళచెరువులో తుమ్మా లూర్దుమేరి అనారోగ్యంతో మృతి చెందటంతో ఆమె మృతదేహానికి కూడా పూలమాలలు వేసి కొమ్మాలపాటి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటరావు, పొన్నెకంటి రవి, గాదె ఇన్నారెడ్డి, వినిగండ్ల కోటయ్య, ఎస్కే కాసుల, తుమ్మా ఇన్నారెడ్డి, రేపూడి తోమాస్, తిరువాయిపాటి ఆంజనేయులు, రేపూడి జోజి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

మండలంలోని కోనూరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పది కుటుంబాలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో శ్రీధర్ సమక్షంలో చేరారు. చేరిన వారిలో గంధం డేవిడ్, చింపతల్లి శ్రీనివాసరావు, ఏకుల చిన నీలాంబరం, జెర్రిపోతు కోటేశ్వరరావు, పెరికల నరసింహారావు, జె.సాంబశివరావు, సాగర్, రామకృష్ణ ఉన్నారు. గ్రామ పార్టీ నాయకులు నందిగం ఆశీర్వాదం, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి రవి, గోళ్ళమూడి చందు తదితర గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి, జనవరి 13 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుపై, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై రాయపాటి రంగబాబు తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించేదే లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014-19 సంవత్సరాల్లో రంగబాబు తండ్రి రాయపాటి సాంబశివరావుకు తెలుగుదేశం పార్టీ లోక్‌సభ సీటు ఇచ్చి గెలిపించిందన్న విషయాన్ని మరచిపోరాదన్నారు. అసమర్థుడిగా ఇంటిలో కూర్చున్న రాయపాటి రంగబాబుకు టీడీపీ పదవి ఇవ్వటం వల్ల గుర్తింపు వచ్చిందన్న విషయాన్ని మరచిపోరాదన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్‌కు డబ్బులు అడిగారని చెపుతున్న రంగబాబు ఎవరు అడిగారో ప్రమాణం చేసి చెప్పాలన్నారు. రంగబాబు ఇకనైనా విమర్శలు మానుకోవాలని లేకుంటే ఆయనకు తగిన విధంగా బుద్ధి చెపుతామన్నారు.

అంబటికి ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతాం

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను వేధించడం మానుకోకపోతే మంత్రి అంబటి రాంబాబుకు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై, నాయకులపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టించినా న్యాయస్థానాల ముందు నిలబడవన్నారు. అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తుందన్నారు. అంబటి బెదిరింపులకు ఏ ఒక్క పసుపు సైనికుడు అదరడు, బెదరడు అనే విషయాన్ని అంబటి గుర్తుంచుకోవాలన్నారు. సత్తెన పల్లిలో అంబటి ఓటమి తథ్యమని ఆయన పేర్కొన్నారు.

రంగబాబు విమర్శలు మానుకో : టీడీపీ

సత్తెనపల్లి జనవరి 13: రాయపాటి రంగబాబు చంద్రబాబుపై, లోకేశ్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని లేకుంటే తగిన బుద్ధి చెబుతామని టీడీపీ నేతలు అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీలోకి వెళ్ళాలని నిర్ణయం తీసుకున్న రంగబాబు సైకోలా మారాడన్నారు. టీడీపీకి రాజీనామా చేసి చంద్రబాబు, లోకేశ్‌లను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇంట్లో కూర్చున్న రంగబాబుకు పార్టీ రాష్ట్రస్థాయి పదవి ఇచ్చి ప్రజలలో గుర్తింపు తెచ్చిన విషయాన్ని మరువరాదన్నారు. చంద్రబాబు, లోకేశ్‌పై విమర్శలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నేతలు చౌటా శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, దివ్వెల శ్రీనివాసరావు, జానీ ఖాజావలి, నూర్‌బాషా జానీబాబు, జానీభాషా, సీతయ్య, తదితరలు ఉన్నారు

అంబటి వ్యతిరేకుల సమావేశం

సత్తెనపల్లి జనవరి 13: మండలంలోని గండ్లూరు గ్రామంలో మంత్రి అంబటి వ్యతిరేకవర్గ వైసీపీ నాయకులు శనివారం సాయంత్రం సమావేశమైయ్యారు. అంబటి మాకొద్దంటూ నియోజకవర్గంలో చేపట్టనున్న భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పలువురు వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు నాయకులు సమావేశానికి హాజరయ్యారు. సంక్రాంతి అనంతరం అంబటి మాకొద్దు, జగన్ ముద్దు అంటూ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

క్రోసూరు, జనవరి 13 : క్రోసూరు మండలంలో నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్న సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్ బేసిక్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మండలంలోని ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. రూ.70,500 చెక్కును శనివారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈవో ఏకుల ప్రసాదరావుకు అందించారు. ప్రభుత్వం సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించటమే కాక ప్రతి నెల జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నరసింహారెడ్డి, సాతులూరి రాఘవ, నీలం చంద్రం, సత్యనారాయణ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అబ్దుల్ సత్తార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన గద్దె భూలక్ష్మికి వాషింగ్ మిషన్ అందిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, న్యాయ నిర్ణేత డాక్టర్ కోట్ల అరుణ కుమారి తదితరులు

మహిళలను ప్రోత్సహించటానికే ముగ్గుల పోటీలు

● టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 13 : తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవటానికి, మహిళలను ప్రోత్సహించటానికి నియోజకవర్గ స్థాయిలో అన్ని గ్రామాల్లో, సత్తెనపల్లిలో ముగ్గుల పోటీలను నిర్వహించామని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో శుక్రవారం సాయంత్రం కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కూడా బహుమతులను అందించారు. ప్రథమ బహుమతి గద్దె భూలక్ష్మికి వాషింగ్ మిషన్, ద్వితీయ బహుమతి మాధవికి మిక్సీ, మూడవ బహుమతి ఏ పద్మకు మిక్సీ, మరో పది మందికి కూడా మిక్సీలను కన్నా లక్ష్మీనారాయణ, న్యాయ నిర్ణేత డాక్టర్ పోట్ల అరుణ కుమారి అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు ఎలినేడి రామస్వామి, కే రంగారావు, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, తోట అంబిక, నూర్ బాషా జానీ బాబు, ఎస్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్, బోడెంపూడి రాజేశ్వరి, దరువూరి నాగేశ్వరరావు, రాంబో బుడే, ఆతుకూరి నాగేశ్వరరావు, కంభాల వెంకటేశ్వరరావు, ఎలినేడి శ్రీనివాస్, చౌట శ్రీనివాసరావు, గుంటూరు ఆశీర్వాదం, బండారు నాగరాజు, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ జనవరి 13 : మండలంలోని మాదలలో సంక్రాంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శనివారం ముగ్గులను వేశారు. ముగ్గుల పోటీలకు సత్తెనపల్లి ప్రముఖ వైద్యులు పోట్ల అరుణ కుమారి నాయ నిర్ణేతగా వ్యవహరించారు. విజేతలకు సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణను మాదల గ్రామ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేసినట్లు టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు రావిపాటి నానయ్య, టి.వెంకటేశ్వర్లు, యలమందరావు, సంగెపు సీత, చాగంటివారిపాలెంలో ముగ్గుల పోటీల విజేతలకు మధిర రామ్మోహన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాజుపాలెం, జనవరి 13 : టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం రాజుపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో టీడీపీ జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి టీడీపీ, జనసేన నేతలు బహుమతులు అందజేశారు.

● నకరికల్లు, జనవరి 13 : టీడీపీ ఆధ్వర్యంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నాయకులు పోటీలను నిర్వహించి బహుమతులను పంపిణీ చేశారు. చల్లగుండ్లలో క్రాపా హరికృష్ణ, తురకపాలెంలో నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు.

● సత్తెనపల్లి పట్టణంలోని 8వ వార్డులో శనివారం రాత్రి కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 20మంది ఎస్సీ, ఎస్టీలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మాజీ మంత్రి కన్నాను కలిసిన కాపునాడు నేతలు

అమరావతి, జనవరి 13 : సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను జిల్లా కాపు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కన్నా సత్తెనపల్లి నుంచి పోటీ చేసేందుకు టీడీపీ నిర్ణయం తీసుకోవడంతో కాపునాడు నాయకులు కన్నా కార్యాలయానికి వెళ్లి అభినందనలు తెలిపారు. కన్నాను కలిసిన వారిలో కాపునాడు జిల్లా అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ, ఎం.రమేష్, ఎ.వెంకటనారాయణ, బి.వెంకటేశ్వరరావు, ఏపూరి అనిల్, బి.వీరేంద్ర, పోలిశెట్టి సాయిబాబు, దేగల నాగేశ్వరరావు, చిన్నా ఉన్నారు.

పార్టీ మారలేదన్న అక్కసుతో దివ్యాంగ బాలుడి పెన్షన్ నిలిపివేత

● నీచ రాజకీయాలకు పరాకాష్టని కొమ్మాలపాటి ధ్వజం



దివ్యాంగ బాలుడిని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

క్రోసూరు, జనవరి 13 : మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన శనగవరపు వీరబ్రహ్మం కుమారుడు, దివ్యాంగ బాలుడు అయిన శ్రీనివాసరావు పెన్షన్ కొద్ది కాలంగా నిలిపి వేశారు. తెలుగుదేశం నుంచి అధికార వైసీపీలోకి మారలేదన్న అక్కసుతోనే తమ కుమారుడి పెన్షన్‌ను ఎమ్మెల్యే ప్రోద్బలంతో అధికారులు నిలిపివేశారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ దృష్టికి వీరబ్రహ్మం తీసుకువెళ్లారు. ఈ క్రమంలో శ్రీనివాసరావు గృహానికి కొమ్మాలపాటి శ్రీధర్ వెళ్లారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ పార్టీ మారలేదన్న నెపంతో ఎటువంటి సానుభూతి లేకుండా అభంశుభం తెలియని దివ్యాంగ బాలుడి పెన్షన్ నిలిపి వేయటం దుర్మార్గం అన్నారు. కులం చూడం, మతం చూడం, పార్టీలు చూడం అని మైకు పట్టుకొని ఊకదంపుడు ఉపన్యాసం చెప్పే ముఖ్యమంత్రి ఇప్పుడు ఏం సమాధానం చెపుతారన్నారు. ఇప్పటికైనా దివ్యాంగ బాలుడికి పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఆయన వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

యెలినేడి దంపతుల ఆందోళన

సత్తెనపల్లి జనవరి 13: పట్టణ ఏఎస్ఐ సుబ్బారావు తనను తిట్టి అవమాన పరిచాడని పట్టణ తెలుగు యువత మాజీ అధ్యక్షుడు యెలినేడి శ్రీనివాస్ శనివారం రాత్రి తన భార్య లక్ష్మీతులసితో కలిసి పట్టణ పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. వెంటనే ఏఎస్ఐ సుబ్బారావు స్నేహంగా మాట్లాడాను బాధపడి ఉంటే సారీ అని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



ధనుర్మాసం సందర్భంగా భవ్యదంపతి పూజ



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 13: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని చినజీయరు స్వామి నిలయం నిర్వాహకులు భవనాశి మల్లికాప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో అహోబిలం రామానుజ స్వామి ఆధ్వర్యంలో భవ్య దంపతి పూజా కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీదేవి అమ్మవారికి పసుపు పూజ నిర్వహించి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు వాయినంగా స్వామీజీ చేతుల మీదుగా పసుపును అందజేశారు. అందరూ సుఖసంతోషాలతో లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు కలిగి ఉండాలని రామానుజ స్వామి భక్తులకు ఉపదేశించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతిలు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. పూజా కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో కలసి పాల్గొన్న పూర్వ విద్యార్థులు

యడ్లపాడు, జనవరి 13: యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో 1994 - 95 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులతోపాటు చదువు చెప్పిన విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దశాబ్దంన్నర తరువాత కలుసుకు న్న విద్యార్థులు చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. పూర్వ విద్యార్థి, మాజీ ఎంపీపీ కరుణాకర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ తరువాత కలసి చదువుకున్న తామంతా కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ ఉన్నతికి కారణమైన గురువులను స్తుతిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు కనకవల్లి, వినతి, మహితకుమారిలతోపాటు లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రామిరెడ్డి, గణపవరం జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

80 మంది కార్మికులకు దుస్తుల పంపిణీ

చిలకలూరిపేట, జనవరి 13: సంక్రాంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో స్థానిక పీ రాంబాబుకు చెందిన పీవీఎల్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలో పని చేస్తున్న 80 మంది కార్మికులకు శనివారం రూ.50వేలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కాపు వెంకటరావు, డైరెక్టర్లు కందిమళ్ళ అంజిబాబు, తాళ్ళ అంజిరెడ్డి, గల్లా సాంబశివరావు, తోటకూర వేంకట నారాయణ, కార్యదర్శి ఏ వేమనరెడ్డి, సంస్థ యజమాని ఐన రోటరీ క్లబ్ సభ్యులైన రాంబాబును అభినందించారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



కబడ్డీలో తలపడుచున్న ఢిల్లీ-కర్ణాటక జట్లు

ఈపూరు, జనవరి 13: మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో రైతుమిత్ర ఆధ్వర్యంలో నాకౌట్‌కమ్‌లీగ్ పద్ధతిలో డేఅండ్‌నైట్ నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరుగుతున్నాయి. కర్ణాటక పైన ఢిల్లీ, గోపువారి పాలెంపైన ముప్పాళ్ళ, పశ్చిమ బెంగాల్ పైన హరియాణ, ఢిల్లీపైన ఝార్ఖండ్ గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అణిచివేత దిశగా పాలన

● 175 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని ఎంఐఎం తీర్మానం

నరసరావుపేట టౌన్, జనవరి 13 :ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అణచివేత దిశగా వైసీపీ పాలన ఉందని, 175 నియోజకవర్గాలలో పోటీచేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని విజయ రెసిడేన్సీలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి రాష్ట్ర నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వైసీపీ మద్దతు తెలిపి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి కృషి చేశామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంఐఎం నాయకులను, ప్రశ్నించిన వారిని వివిధ తప్పుడు కేసుల్లో అరెస్టులు చేయించినట్లు అభిప్రాయపడ్డారు. ఈ విధమైన అణచివేతకు, నిరంకుశ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తీర్మానాన్ని ఓవైసీ దృష్టికి తీసుకెళతామని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కర్నూల్ కన్వీనర్ షేక్ జునేద్, గుంతకల్లు కన్వీనర్ షేక్ భాషా, వినుకొండ కన్వీనర్ షేక్ బాజీ, పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలీ, కార్యదర్శి షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

బరంపేటలో మన ఊరు, మన ఆట



కార్యక్రమంలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 13 : జనసేన మన ఊరు, మన పేరు కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని బరంపేటలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ జిలానీ మాట్లాడుతూ సంక్రాంతి ప్రతి ఇంట్లో కొత్త కాంతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనంద్, పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, కృష్ణంశెట్టి గోవిందు, గుప్తా శ్రీకాంత్, గొట్టిపాటి శివ, జగదీష్, బాల వెంకటసాయి, మిరియాల జడ శ్రావణి, దుర్గాకుమారి వీర మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

చిలకలూరిపేట, జనవరి 13: మండలంలోని పసుమర్రులో శనివారం విద్యుత్ స్తంభం మీద నుంచి కింద పడి ఒక వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. గాయపడిన వ్యక్తి బంగారు నూకరాజు(42)గా గుర్తించారు. గ్రామ పంచాయతీలో అటెండరుగా ఉద్యోగం చేస్తున్న ఇతడు గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్‌లుగా విధులు నిర్వహించే వారి వద్ద అనధికారికంగా విద్యుత్ లైన్‌మన్‌గా పని చేస్తుంటాడని తెలిసింది. శనివారం ఉదయం ఒక గృహానికి విద్యుత్ సర్వీస్ లైన్ స్తంభంపై బిగిస్తుండగా విద్యుత్‌షాక్‌తో స్తంభం మీద నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడని గ్రామ మాజీ సర్పంచ్ కోట కిషోర్‌బాబు తెలిపారు. అతని తలకు, కాళ్లకు, నడుంకు తీవ్రంగా గాయాలవగా చికిత్స కోసం అతడిని గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీలకు వివిధ పార్టీలు, సంఘాల మద్దతు



వినుకొండలో రేగిపళ్లతో చిన్నారులను దీవిస్తున్న అంగన్‌వాడీలు

చిలకలూరిపేట, జనవరి 13: 33 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు మద్దతు ప్రకటించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వీరంతా సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం రాధాకృష్ణ, టీడీపీ నాయకులు ఎం మల్లిబాబు, అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు జీ సావిత్రి, మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద శిబిరం వద్దకు యూటీఎఫ్ నాయకులు కే శ్రీనివాసరెడ్డి, కే తిరుపతి స్వామి, కే అరుణ తదితరులు వచ్చి వారి ఉద్యమానికి మద్దతు ప్రకటించి రూ.5వేలు విరాళంగా అందజేశారు.

పండుగ రోజుల్లో పస్తులుంటూ.. అంగన్‌వాడీల దీక్షలు

వినుకొండటౌన్, జనవరి 13 : చర్చల పేరుతో అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వం అవమానిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి అన్నారు. స్థానిక సురేష్‌మహల్ రోడ్డులో అంగన్‌వాడీ కార్యకర్తలు 33 రోజులుగా చేపడుతున్న రిలే దీక్షలను ఉద్దేశించి శనివారం ఆయన మాట్లాడుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి వేతనాలను జూలైలో పెంచుతామని హేళనచేస్తూ కార్యకర్తలను ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వానికి వేతనాలు పెంచే ఉద్దేశం లేనప్పుడు కార్యకర్తలను చర్చలకు ఎందుకు పిలిచారని ఆయన నిలదీశారు. అనంతరం దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు చిన్నారికి రేగిపండ్లు పోసి దీవించి భోగిమంటతో ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, అంగలకుదురు ఆంజనేయులు, లక్ష్మీప్రసన్న, దేవి, కృష్ణకుమారి, జి.పద్మ, జె.పద్మ, గాయత్రి, నిర్మల, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట శిబిరంలో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం నేత రాధాకృష్ణ

జనసేన మద్దతు

ఈపూరు, జనవరి 13: ఈపూరు ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలకు జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర్రావు శ్రీనివాసరావు మద్దతు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

నాదెండ్ల, జనవరి 13: మండలంలోని గణపవరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నిత్యావసరాలను శనివారం పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కెల్లంపల్లి అచ్చయ్య తన తల్లి సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువ చేసే నిత్యావసరాలను 36 మందికి పంపిణీ చేశారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ మద్దతు

నరసరావుపేట టౌన్, జనవరి 13: పట్టణంలోని గాంధీపార్కు వద్ద ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్, ఏపీ ప్రగతిశీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మెకు కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయనాయక్, గుంటూరు మల్లేశ్వరి, డీ శివకుమారి, ఎంఐఎం నేతలు జాన్‌సైదా, మహబూబ్ బాషా, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతోనే సంక్రాంతి సంబరాలు

● ఒక్క రూపాయి కూడా విరాళం లేదు


● చందాల వసూలు ప్రచారాన్ని ఖండించిన కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, జనవరి 13 : నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు సంక్రాతి సంబరాలు నిర్వహించనున్నారు. సంబరాల నిర్వహణకు చందాలు వసూలు చేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఖండించారు. ఒక్క రూపాయి కూడా విరాళం లేదని స్పష్టం చేశారు. పూర్తిగా ప్రభుత్వ నిధులను సంక్రాంతి సంబరాలకు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. రూ.18 నుంచి రూ.20 లక్షల వరకు వ్యయం కానున్నదని అంచనా వేశామన్నారు. గత ఏడాది నిర్వహించిన సంక్రాంతి సంబరాల వ్యయంలో కొంత మేర విరాళాలు ఉన్నాయని చెప్పారు. సూమారు రూ.25 లక్షలు ఖర్చు కాగా రూ.10 లక్షలు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విరాళం ఇచ్చారని తెలిపారు. మిగతా మొత్తాన్ని ప్రభుత్వ నిధుల నుంచి వినియోగించినట్టు వివరించారు.

సంక్రాంతి పర్వదినాన్ని ఉత్సహంగా వేడుకగా జరుపుకోవాలని జిల్లా వాసులకు సందేశం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో నరసరావుపేటలో సంక్రాంతి సంబరాలను సింబాలిక్‌గా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మూడు రోజులు సంక్రాంతి సంబరాలను వైవిధ్య భరితంగా వినోదాత్మకంగా జరుపుకోవడానికి ప్రణాళిక రూపొందిచామన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సంప్రదాయలు, విశిష్టతలను తెలియజేసే విధంగా సంబరాలు జరుగుతాయన్నారు. జిల్లా ప్రజలను సంబరాలకు అహ్వానిస్తున్నామన్నారు. సాంస్కృతిక కళావేదిక, ప్రభుత్వం సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది సంబరాలు ఘన విజయం సాధించాయి. మంచి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను అలరిస్తాయన్నారు. పల్నాడు జిల్లా ప్రాముఖ్యతను చాటిచెప్పే విధంగా లేజర్ షో ఉంటుందన్నారు. సంక్రాంతి సంబరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

పరిష్కారం కాని డబల్ ఎంట్రీ ఓట్ల సమస్య

యర్రకొండపాలెంలో నివాసం ఉంటూ వినుకొండలో పలువార్డుల్లో ఓటు హక్కు..



పట్టణంలో పలువార్డుల్లో డబుల్ ఎంట్రీతో నమోదైన ఓటర్లు

వినుకొండటౌన్, జనవరి 13: యర్రకొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గంలో నివాసం ఉంటున్న కొందరికి వినుకొండ పట్టణంలోని 32 బూత్‌ల్లో ఓటు నమోదు కలిగి ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. యర్రకొండపాలెం అసెంబ్లీ కోడ్ (102) వినుకొండ అసెంబ్లీ 99 పట్టణంలో వివిధ వార్డుల్లో నమోదైన పేర్లను పరిశీలిస్తే.. బూత్ నెం.23లో 4 సీరియల్ నంబరులో పుచ్చకాలయ మన్నెమ్మ, 474లో మల్లికార్జునరావు, 489లో మేకల మన్నెపల్ల య్య, బూత్ నెం. 32లో 186వ సీరియల్ నంబరులో నాసర్‌వలి, బూత్ నెం.34లో 127 సీరియల్ నంబరులో మస్తాన్‌వలి, 43, 453 శ్రీను, 74-167లో నాగమ్మ, 115 బూత్ నంబరులో 749లో ఇర్ల వీరమ్మ, 116లో 4వ సీ.నెం. బాజీ, 121-409 వలి, 129- 448లో గుర్రం సుబ్బారావు, 115-473 లక్ష్మీతిరుపతమ్మ, 165-637 లో వెంకటేశ్వర్లునాయక్, 174-319లో నాగూర్‌బాషా, 185-962 రమణ, 186-631లో చిన్నమ్మ, 187-1193 భవాని, 194-233లో రేష్మా, 194-414 రేష్మా, 195-462లో ముబీన, 199-13లో నాసర్‌వలి, 202 - 1298 వెంకటేశ్వర్లు, 206-110లో కరీంబాషా, 210-1136లో వెంకటలక్ష్మి, 215-214 గోపి శ్రీను, 216-879 సంధ్యారాణి, 224-1067 సీరియల్ నంబరులో బాషా ఇలా చెప్పుకుంటూ పోతే మొత్తం 35మంది యర్రగొండపాలెంలో ఓటు కలిగి వినుకొండలోని వివిధ బూత్ నంబర్లతో ఓటు కలిగి ఉండటంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకే సీరియల్ నంబరులో ఫొటోలు కనపడి కనపడనట్లుగా పేర్లల్లో తేడా ఉన్న తీరుపై కొందరు ఓటర్లు ఓటు హక్కు కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి తమ ఓటు ఉందో లేదో చూసుకునే పరిస్థితి పట్టణంలో ఉంది. ఇదిలా ఉండగా ఇమ్మడిశెట్టి గురువర్ధని, ఇంటి నెం. 29-181లో 196, 198లో ఓటు హక్కు కలిగి ఉంది. లక్ష్మీవిజయ, ఇంటి నెం. 14-78/1, 15-57 నంబర్లతో 195, 193 బూత్‌ల్లో ఓటు కలిగి ఉంది. నవీన పందుల ఇంటి నెం. 23-249, 16-1తో వేర్వేరుగా ఓటు కలిగి ఉన్నారు. శ్రీదేవి పల్లపాటి ఇంటి నెం.5-208, 16-89తో 266బూత్‌లో ఓటు హక్కు కలిగి ఉంది. గుడిపాటి నరేష్ ఇంటి నెం. 3-57, 5-17తో 243 బూత్‌లో డబుల్ ఎంట్రీ ఓట్లు కలిగి ఉన్నాడు. ఇలా బూత్‌కు 100 నుంచి 200లకు పైగా డబుల్ ఎం ట్రీలు నమోదైనట్లు ప్రతిపక్షపార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల అధికారులు డబుల్ ఎంట్రీ ఓట్లను పరిశీలించి తొలగించాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు.

వైద్యశిబిరంలో 253 మందికి పరీక్షలు

నాదెండ్ల, జనవరి 13: మండలంలోని తూబాడు గ్రామంలో చెన్నుపాటి ఇండో - అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, జొన్నలగడ్డ వారిచే ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. చెన్నుపాటి కోటయ్య, దగుమల్లి నరసింహారావుల జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో వైద్య నిపుణులు చెన్నుపాటి సాయి కమల్, జయప్రస న్న సాయి, పీ మహేశ్వరరావు, పీ శివరామకృష్ణ, ఏ శివప్రసాదు, నెల్లూరి రమేష్, డాక్టర్ శ్రీకర్‌లు 253 మందికి పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమాన్ని చెన్నుపాటి పవన్, చెన్నుపాటి నాగేశ్వరరావులు పర్యవేక్షించారు.

బొల్లాపల్లిలో 15న వైద్యశిబిరం

బొల్లాపల్లి, జనవరి 13: బొల్లాపల్లిలో ఈనెల 15న వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు శిఖా జోసెఫ్ శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు బొల్లాపల్లి ఇమ్మానియేలు ప్రార్థనా మందిరం నందు మెగా వైద్యశిబిరం నిర్వహిస్తారని చెప్పారు.

కల్యాణ మండపానికి రూ.10 లక్షలు విరాళం



విరాళం అందిస్తున్న రామిరెడ్డి

నాదెండ్ల, జనవరి 13: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామస్థుడు, గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెంలో గ్రామంలో నిర్మి స్తున్న కల్యాణ మండప నిర్మాణానికి ఈ మొత్తాన్ని అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు.

ముప్పాళ్ళలో రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు

ఈపూరు, జనవరి 13: మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో సంక్రాంతి పండుగ సందర్భంగా నందమూరి తారకరామారావు మెమోరియల్, శివశక్తిలీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించే పోటీల్లో చుక్కలు, గీతలు, లోకల్, నాన్‌లోకల్‌గా విభజించి నిర్వహిస్తారని నిర్వాహకుడు రాపర్ల జగ్గారా వు తెలిపారు. పోటీలను మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శివశక్తి లీలాఅండ్ అంజన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు లీలావతి ప్రారంబించనున్నట్లు జగ్గారావు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

వినుకొండ, జనవరి 13: వినుకొండ ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్(పి)గా విధులు నిర్వహించిన ముంద్రు విజయరాజకుమార్ జయంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను డీఎం బి.కోటేశ్వరరావునాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం కల్పించిన విజయరాజకుమార్ కుటుంబసభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

నాదెండ్ల, జనవరి 13: నాదెండ్ల గ్రామంలో వివాదాస్పదంగా మారిన ప్రహరీ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలోని వడ్డెర కాలనీ ప్రాంతానికి చెందిన తన్నీరు వెంకట నారాయణ అనే వ్యక్తి బత్తుల ఆదిలక్ష్మి కుటుంబసభ్యులు వెళ్లేందుకు దారి లేకుండా ప్రహరీ నిర్మాణం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆదిలక్ష్మి నాదెండ్ల పోలీసు స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. అడ్డుకున్న పోలీసులు ఈ విషయాన్ని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు దృష్టికి తీసుకు రాగా వెంకట నారాయణను పిలిపించి ప్రహరీ నిర్మాణం సరైన పద్ధతి కాదంటూ నచ్చ జెప్పారు. దీంతో ఆయన నిర్మాణాన్ని నిలిపివేశారు.

పలు గ్రామాల్లో వికసిత్ భారత్

నూజెండ్ల, జనవరి 13: మండలంలోని కంభంపాడు, తెల్లబాడు గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ మాట్లాడుతూ దేశానికి పల్లెటూళ్ళు పట్టుగొమ్మలని, పల్లెలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన, పీఎం అటల్ పెన్షన్ యోజన, ఉజ్వల పథకం, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాలు బీజేపీ ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తుందన్నారు.

వైసీపీ ఎన్నికల కార్యాలయానికి ప్రారంభోత్సవం

చిలకలూరిపేట, జనవరి 13: నియోజకవర్గ వైసీపీ ఎన్నికల కార్యాలయాన్ని శనివారం స్థానిక నరసరావుపేట రోడ్డులో కొత్తగా ప్రారంభించారు. సర్వమత ప్రార్థనలతో ఈ కార్యాలయాన్ని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన మల్లెల రాజేష్‌నాయుడు ప్రారంభించారు. విశాలమైన ప్రాంగణంలో వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లతో పాటు నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక గదులను కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోని నియోజక వర్గంలోని వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

వినుకొండ, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పల్నాడు జిల్లా ప్రజలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగలో రైతుల ఇంట కొత్త పంటలతో కళకళలాడాలన్నారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సంక్రాంతి సంబరాలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

లక్షల కోట్లు కొల్లగొట్టిన ఆర్థిక నేరస్థుడు జగన్‌రెడ్డి

● పెత్తందారి జగన్‌రెడ్డికి శిక్ష తప్పదు : జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 13: జగన్మోహన్‌రెడ్డి రూ.4 లక్షల కోట్లు కొల్లగొట్టిన ఆర్థిక నేరస్థుడని, పెత్తందారికి శిక్ష తప్పదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. సీఐడీని అడ్డం పెట్టుకొని చంద్రబాబునాయుడుపై కక్ష సాధింపుకు పాల్పడ్డారని, నీలి మీడియా దుష్ప్రచారం చేస్తూ రాష్ట్రాన్ని దోచుకున్న జగన్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయం అన్నారు. ప్రజలను పాలించాల్సిన ముఖ్యమంత్రి పెత్తందారి పోకడతో నియంతగా వ్యవహరిస్తున్న తీరును ఎమ్మెల్యేలు, ఎంపీలు బహిరంగంగా ఎండగడుతున్నారని, అటువంటి జగన్‌రెడ్డికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని అన్నారు. 2004లో రూ 1.73 కోట్లు ఆస్తి కలిగిన జగన్మోహన్‌రెడ్డి 19 ఏళ్ళలో రూ.4 లక్షల కోట్లుకు ఎలా ఎగబాకాడో రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఆర్థిక నేరస్థుడైన జగన్‌రెడ్డిపై 38 కేసులు, రూ.43 వేల కోట్ల దోపిడిపై సీబీఐ, ఈడీ చార్జిషీట్ వేసిందన్నారు. ఆర్థిక నేరస్థుడైన జగన్‌రెడ్డికి శిక్ష పడుతుందనే భయంతో 12 ఏళ్ళలో 3500 వాయిదాలు తీసుకున్నాడని గుర్తు చేశారు. లక్షల కోట్లు దోచుకున్న ఆర్థిక నేరస్థుడంరు జగన్‌రెడ్డి ప్రజలను దారి మళ్ళించేందుకు సీబీఐని అడ్డం పెట్టుకొని మచ్చలేని చంద్రబాబునాయుడుపై కక్ష సాధింపు చర్యలకు దిగి అక్రమ అరెస్టులతో మిడియాతో దుష్ప్రచారం చేయించాడని దుయ్య బట్టారు. లక్షల కోట్ల రాష్ట్ర సంపదను దోచుకొని అరాచక పాలనతో అన్ని వర్గాలను సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డికి ఈ రాష్ట్ర ప్రజలు యావజ్జీవ శిక్ష వేయటం తప్పదని హెచ్చరించారు.

రాష్ట్రంలో ఎస్సీలకు జగన్ వల్ల తీరని అన్యాయం

● టీడీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు కుంపటి రవి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు రవి తదితరులు

నరసరావుపేట టౌన, జనవరి 13: జగన్మోహన్‌రెడ్డి వల్ల రాష్ట్రంలో ఎస్సీలకు జరిగిన అన్యాయం స్వతంత్ర బారతదేశంలో ఎక్కడా జరిగి ఉండదని టీడీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు కుంపటి రవి అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా ఒక ఎస్సీకైన లోను ఇచ్చారా? అని ప్రశ్నించారు. మొత్తం రూ.86670 కోట్లు ఈ ఐదు సంవత్సరాల్లో ఎస్సీ సబ్ ప్లాన్ కింద రిలీజ్ చేశారన్నారు. గతంలో క్యాలెండర్ మారగానే ఎస్సీ కార్పొరేషన్ లోన్లు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వచ్చేయని అన్నారు. ఈ నాలున్నర సంవత్సరాల్లో ఎస్సీలకు చెందిన ఒక వ్యక్తి కూడా లోను వచ్చింది లేదన్నారు. ఇంతకు ముందు ఇంటర్ నుంచి పీజీ వరకు ఉపకారవేతనం ఉండేదన్నారు. ఇంతకు ముందు అంబేద్కర్ ఓవర్‌సిస్ పథకం ఉండేదన్నారు. విదేశాలు వెళ్లి చదువుకున్నారని అన్నారు. ఆ పథకాన్నే మరచి పోయారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీల వల్ల జగన్మోహన్‌రెడ్డికి తిరుగుబాటు కనిపిస్తుందని, 19న ప్రతి నియోజకవర్గం నుంచి ఎస్సీలను అంబేద్కర్ విగ్రహం ఓపెనింగ్‌కు తరలిస్తారని, అయినా ఎస్సీలు మాత్రం బుద్ధి చెప్పి తీరుతారని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కొండెపోగు సునీల్‌రాజు, వర్ల బాబారావు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీకి ప్రజాదరణ



సంతగుడిపాడులో నాలుగో రోజు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న అరవిందబాబు

రొంపిచర్ల, జనవరి 13: బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ అరవిందబాబు తెలిపారు. శనివారం మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో నాలుగో రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సంక్షేమం పేరుతో వెయ్యి రూపాయలు ఇచ్చి పన్నుల రూపేణా రూ.100 వసూలు చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆదాయాన్ని కోల్పోయారన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రాధాన్యం

● రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నరసరావుపేట రూరల్, జనవరి 13: యువత భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోగల భువనచంద్రటౌన్ హాలు నందు వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్‌మీట్ & గ్రీట్ కార్యక్రమానికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని మల్లమ్మ సెంటరు, గడియారస్తంభం మీదుగా ప్రకాష్‌నగర్‌లోగల భువనచంద్ర టౌన్‌హాలు వరకు బారి బైక్ ర్యాలీలో బైరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో బైరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో పాటుగా విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

గణతంత్ర వేడుకలకు ఎన్‌సీసీ అధికారి, క్యాడెట్ ఎంపిక

నరసరావుపేట టౌన్, జనవరి 13 : ఢిల్లీలో జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు ఎస్ఎస్ఎన్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ బీఎస్ ఆర్‌కే రాజు, ఎన్‌సీసీ క్యాడెట్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మల్లయ్య శనివారం తెలిపారు. బీఎస్ఆర్‌కే రాజు, కొండెబోయిన ఏడుకొండలును కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, పెనుగొండ వెంకటేశ్వర రావు, ఊటుకూరి అప్పారావు, రామ్‌మోహన్‌రావు, కూనిశెట్టి లక్ష్మయ్య, వక్కలగడ్డ కోటేశ్వరరావు, మురళి, తాడేపల్లి భావనారాయణ, కోటేశ్వరరావు, కేవీఎస్ శేషుకుమార్ తదితరులు అభినందించారు.

మృతురాలి కుటుంబసభ్యులకు నాయకుల పరామర్శ

రొంపిచర్ల, జనవరి 13: మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన షమ్మి ప్రకాశం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాగా శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆమె మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ అర విందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రాము షమ్మి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.